క్లుప్తంగా

డీఎల్‌పీవోగా నాగలత



డీఎల్‌పీవో నాగలతను సత్కరిస్తున్న రూరల్ మండల పంచాయతీ కార్యదర్శులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో)గా ఎం.నాగలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నరసాపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం డీఎల్‌పీవోగా పనిచేసిన జేవీ సత్యనారాయణ నరసాపురానికి బదిలీ అయ్యారు. కాగా.. డీఎల్‌పీవోగా బాధ్యతలు చేపట్టిన నాగలతను డీఎల్‌పీవో కార్యాలయం సూపరింటెండెంట్, రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని పంచాయతీలలో శానిటేషన్‌పైనా, ఇంటి పన్నుల వసూలుపై దృష్టి సారిస్తామన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి రాంబాబును ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులపై కాల్పులు అమానుషం

కడియం: వ్యవసాయ చట్టాల రద్దు కోరుతూ ఉద్యమం చేస్తున్న రైతులపై కాల్పులకు దిగడం అమానుషమని ఏఐకేఎంఎస్ నిరసన తెలిపారు. ఆ ఘటనలో మృతి చెందిన శుభ్‌కరన్‌సింగ్‌కు సోమవారం రాత్రి దుళ్ల ఎర్ర కాలనీలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. సంఘం నాయకుడు వి.భీమశంకరం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, దేశ సంపదను కార్పొరేట్లకు తెగనమ్ముతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, అలజంగి గడ్డియ్య, తాతబ్బాయి, పితాని ధనలక్ష్మి, చిన్నమ్ములు, గుదిరెడ్ల నరసమ్మ పాల్గొన్నారు.

పల్స్‌పోలియో సిబ్బందికి శిక్షణ

కడియం: మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనే సిబ్బందికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య సిబ్బంది శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఎస్.జెస్సీ సుప్రియ, ఎం.మణిజ్యోత్స్న మాట్లాడుతూ కార్యక్రమం షెడ్యూల్‌ను తెలియజేశారు. మొదటి రోజు బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేస్తారన్నారు. రెండో రోజు ఇంటింటికీ వెళ్లి, పోలియో చుక్కలు వేయించుకోని వారిని గుర్తించి, వారికి కూడా అందజేస్తారన్నారు. మండలంలో మొత్తం 35 బూత్‌లు, ఒక మొబైల్ టీం, ఒక ట్రాన్సిట్ టీం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వైద్య శాఖ సిబ్బంది ఎం. రామకృష్ణ, ఎండీ ఆలీబేగ్, కృష్ణకుమారి, బి.ఉమాదేవి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఓపెన్ ల్యాబ్ డే

ప్రకాశం నగర్: ప్రభుత్వ అటానమస్ కళాశాలలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఓపెన్ ల్యాబ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. కళాశాలలోని అతి ప్రాచీనమైన లైబ్రరీ, ఫిజిక్స్ విభాగంలోని పురావస్తు సంగ్రహాలయ (ఆంటిక్ ఎక్విప్మెంట్ ల్యాబ్) జువాలజీ మ్యూజియం, బొటానికల్ గార్డెన్ జియాలజీ మ్యూజియం, కెమిస్ట్రీ ల్యాబ్స్, బయోటెక్నాలజీ ల్యాబ్ సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ లేబరేటరీ వంటి అనేక ప్రయోగశాలలను నగరంలోని విద్యార్థులు, సాధారణ ప్రజల సందర్శన కోసం తెరిచి ఉంచుతామన్నారు.

చెత్త డంపింగ్‌పై మంత్రి వేణు ఆగ్రహం

కడియం: దుళ్ల బైపాస్ రోడ్డు మీద చెత్త వేయడంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే మార్గంలో సోమవారం వెళుతున్న మంత్రి వేణు ఆ చెత్తను గమనించి ఎంపీడీవో రాజ్‌మనోజ్‌కు ఫోన్ చేశారు. చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో ఈవోపీఆర్‌డీ విక్టర్‌బాబును అక్కడకు పంపించి వెంటనే చెత్తను తొలగింపు పనులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య పాల్గొన్నారు.

సిరి యమహా బ్లూస్క్వేర్ ప్రారంభం



జ్ఞాపికలు అందజేస్తున్న వీధి రామ్‌ప్రసాద్, చింతం తమ్మయ్య నాయుడు

రాజమహేంద్రవరం రూరల్: సిరి మోటార్స్ యమహా కస్టమర్లకు మరిన్ని సేవలందించడం కోసం మోరంపూడి రోడ్డులోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదురుగా సిరి మోటార్స్ బ్లూ స్క్వేర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సౌత్ జోనల్ హెడ్ కేఎస్‌వీఎస్ సురేష్, రీజినల్ హెడ్ మహేష్ రెడ్డి, సేల్స్ సర్వీస్, స్పేర్స్ ఏరియా మేనేజర్లు, పలువురు ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. సంస్థ అధినేతలు వీధి రామ్‌ప్రసాద్, చింతం తమ్మయ్య నాయుడు మాట్లాడుతూ ఇప్పటివరకూ ఉన్న ప్రీమియం బైక్‌లతో పాటు స్పోర్ట్స్ బైక్ ఎంటివో 3, ఆర్ 3 వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ బ్యాంకర్లు, ఫైనాన్షియర్లు, కో డీలర్లు, ఆటో కన్సల్టెన్సీ, యాజమాన్య సిబ్బంది పాల్గొన్నారు.

నగర అభివృద్ధే ప్రధాన లక్ష్యం



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్
- రోడ్డు పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ: నగర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక 12వ డివిజన్ సోమాలమ్మ పుంత రోడ్డు, తిలక్ రోడ్డు కలుపుతూ డాన్ భాస్కో రోడ్డును సీసీ రోడ్డుగా మార్చే పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రూ.60 లక్షల అంచనాతో ఈ పనులు చేపట్టబోతున్నామన్నారు. కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జి కొయ్యాన పెద్దిరాజు, ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ శేషగిరి, ఏఈ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, అదే సమయంలో డివిజన్లలోని సమస్యలపై దృష్టి సారించి, వెంటనే పరిష్కరించాలని ఆర్ఎంసీ అధికారులకు ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ఆదేశించారు. స్థానిక 21వ డివిజన్‌లో సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి, పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అజ్జరపు వాసు, వార్డు ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ, కొల్లేపల్లి శేషయ్య పాల్గొన్నారు.



రోడ్డు పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

కడియం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ కోరారు. సోమవారం కడియంలో స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, పారిశుధ్య సిబ్బందికి సహకరించాలన్నారు. చెత్తను మురుగు కాలువల్లో వేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అంతకు ముందు గ్రామంలోని పలు ప్రధాన వీధుల్లో ఆయన పర్యటించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో దంత వైద్యశిబిరం

రాజమహేంద్రవరం సిటీ: సెంట్రల్ జైలులో సోమవారం మెగా దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 256 మంది ఖైదీలకు దంత పరీక్షలు జరిపారు. కాకినాడ ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ శిబిరంలో రూ.25 వేలు విలువైన మందులు, బ్రష్‌లు, పేస్టులు, మౌత్ వాష్‌లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కారాగార వైద్య నిపుణులు కోమలి, రాజేశ్వరి, ఉపాధ్యక్షుడు వెంకటపతి, రాష్ట్ర ఐడీఏసీడీహెచ్ కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ, కాకినాడ ఐడీఏడి సభ్యులు వైద్యసేవలు అందించారు.



వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

బయోటెక్నాలజీ పరిశోధనలతో ఎంతో మేలు

ప్రకాశంనగర్: బయోటెక్నాలజీ పరిశోధనలు మానవ మనుగడకు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థులు ఆ రంగంలో పరిశోధనల వైపు అడుగులు వేయాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్ డాక్టర్ సీహెచ్ కృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ డీబీటీసీటీఈపీ న్యూఢిల్లీ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కళాశాలలోని బయోటెక్నాలజీ విభాగంలో పాపులర్ లెక్చర్ సిరీస్ అడ్వాన్సస్ ఇన్ బయోటెక్ క్రానికల్స్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఈనెల 28 వరకూ ఈ సదస్సు జరుగుతుందన్నారు. లెక్చర్ సిరీస్‌లో మొదటిదైన రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మైక్రోబియల్ అండ్ ప్లాంట్ బయోపెస్టిసైడ్స్ ఫర్ క్రాఫ్ట్ ఇంప్రూవ్మెంట్ అనే అంశంపై కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ వై.సురేష్ ప్రసంగించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

ఆహార పదార్థాల్లో క్రిమిసంహారక ఎరువుల పేరుతో విషతుల్యమైన రసాయనాలను వాడటం జరుగుతోందని, దీని మూలంగా అనేక వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి చెందిన సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయనిర్మల, బయోటెక్నాలజీ విభాగాధిపతి బి.నాగేశ్వరి, కె.అనూష, కళాశాల అధ్యాపకులు ఎ.అన్నపూర్ణ, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

అదనపు పోషకాహారంగా మునగాకు పొడి

- ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కార్యకలాపాలు
- కలెక్టర్ మాధవీలత



ప్రాజెక్ట్ ఐరన్ ప్లస్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఓఎన్‌జీసీ అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్

రాజమహేంద్రవరం రూరల్: కౌమార దశలోని ఆడపిల్లల్లో రక్తహీనత నివారణకు ఓఎన్జీసీ ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత కార్యకలాపాల్లో భాగస్వామ్యం 2.2 వెర్షన్ ద్వారా మునగాకు పొడి పంపిణీ చేయడం అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక గురుకుల గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత కారణంగా కళ్లు తిరిగి పడిపోవడం వంటివి జరుగుతూ ఉంటాయన్నారు. మనం తీసుకునే ఆహారంలో తప్పకుండా ఐరన్ పోషకాలు అందుతున్నాయో, లేదో నిర్ధారణ చేసుకోవడం ముఖ్యమన్నారు. పిల్లలు చిన్నతనం నుంచే ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు చేసుకోవాలన్నారు. గతంలో చిరుధాన్యాలు, రాగులు, జొన్నలు, సజ్జలను ఆహారంలో తీసుకునేవారన్నారు. నేడు ఫాస్ట్ ఫుడ్, పోషక విలువలు లేని ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనతకు గురవుతున్నారన్నారు. ఓఎస్‌జీసీ ఆధ్వర్యంలో కౌమార దశలోని బాలికలకు మునగాకు పౌడర్ ఇస్తారని, దీనిని రోజు విడిచి రోజు ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించడం సాధ్యం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తోందని, దానికి అదనంగా ప్రాజెక్ట్ ఐరన్ ప్లస్ కార్యక్రమం ద్వారా మునగాకు పొడి అందజేస్తున్నట్లు తెలిపారు.

బాలికలే సమాజానికి వెన్నెముక

ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్ మాట్లాడుతూ నేటి బాలికల రేపటి ఆరోగ్యవంతమైన సమాజానికి వెన్నుముకన్నారు. వారు ఆరోగ్యంగా ఉండాలనే, పోషక లోపాలను అధిగమించే ప్రయత్నంలో భాగంగా ప్రాజెక్ట్ ఐరన్ ప్లస్ కార్యక్రమానికి నాంది పలికినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది బాలికలకు దీనిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనరల్ మేనేజర్ సంతన్ దాస్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఆడపిల్లల్లో రక్తహీనత అధిగమించేందుకు మునగాకు పొడి అందజేయాలని ప్రతిపాదన రావడం జరిగిందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమంలో మమ్మల్ని భాగస్వాములు చేసిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ ప్రతినిధులు ఎల్ఎస్ రాజు, కె.సురేష్ కుమార్, జి.ప్రశాంత్, రవీంద్ర, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా టీబీ, లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఎస్.వసుంధర, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు కేఎన్ జ్యోతి, ఎం.సందీప్, పీఎస్ రమేష్ పాల్గొన్నారు.

పల్లి జాన్ మృతిపై సీబీఐ విచారణ జరపాలి

సీటీఆర్ఐ: తొర్రేడు గ్రామానికి చెందిన పల్లి జాన్ మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలని జాన్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం ఆర్‌డీఓ చైత్రవర్షిణికి వినతిపత్రం సమర్పించారు. జాన్ తల్లి కుమారి మాట్లాడుతూ పథకం ప్రకారం తన కుమారుడిని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఘటనలో వాస్తవాలను మరుగున పరిచేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కేసు విషయంలో అనేకసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ దర్యాప్తులో పురోగతి లేదని తెలిపారు. అందుకే సీబీఐ విచారణ జరపాలని కోరారు. కాగా.. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆరు అర్జీలను స్వీకరించామని కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌సీ) తహసీల్దార్ సత్యనారాయణరాజు తెలిపారు.



ఆర్‌డీఓ చైత్రవర్షిణికి వినతిపత్రం అందిస్తున్న జాన్ కుటుంబ సభ్యులు

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

కడియం: వేమగిరి రాందాస్ పేటలో నివాసం ఉంటున్న కె.నూకాలమ్మ భర్త ఇటీవల మృతి చెందారు. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు. వారిని చదివించుకోలేక నూకాలమ్మ ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలిసిన రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ సోమవారం ఆమెకు ఆర్థిక సాయం అందించారు. పిల్లలను బాగా చదివించాలని ఆయన సూచించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కడియం: దుళ్లలో కొలువైన కోదండ రామస్వామిని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ దర్శించుకున్నారు. ఒంగోలు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ఆయన మార్గంమధ్యలో స్థానికుల ఆహ్వానం మేరకు దుళ్ల విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం భవనాన్ని పరిశీలించారు. ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి వారణాశి శ్రీనివాస గుప్తా, జిల్లా సంయుక్త కార్యదర్శి తమ్మన సత్తిబాబు, జిల్లా జోన్ కన్వీనర్ కంచర్ల మూర్తి, మండల కమిటీ మెంబర్ ఒబిలిశెట్టి బుచ్చిరాజు, దుళ్ల సంఘం అధ్యక్షుడు ఓబిలిసెట్టి కాశీ, సెక్రటరీ కొరుప్రోలు పుల్లం ప్రసాద్ పాల్గొన్నారు.



కుప్పం ప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

వైభవంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ



రాజరాజేశ్వరి ఆలయంపై శిఖరాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు



మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: గ్రామంలోని రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామివార్ల ప్రాంగణంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణాంతరం చేపట్టిన శిఖర ప్రతిష్ఠోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. కుందుల బలరామకృష్ణ ఆర్థిక సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుమారు రూ.25 లక్షలతో ఆలయ పునర్నిర్మాణం, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో రెండు రోజులు మండపారాధనలు, హోమాలు నిర్వహించారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న సంస్థ సభ్యులు

రాజానగరం: యాంత్రిక జీవన విధానంలో పెరిగిపోయిన కాలుష్యాన్ని నివారించేందుకు, మనల్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల నాటడం ఎంతో అవసరమని దివాన్ చెరువుకు చెందిన ప్రముఖ వైద్యుడు కంభంపాటి వీర వెంకట రామసుబ్రహ్మణ్యం (రాంబాబు) అన్నారు. దివాన్ చెరువులోని సేవా ఉగాది అనే స్వచ్ఛంద సేవా సంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా 'మొక్కలను నాటండి - ఆరోగ్యం పొందండి' పేరిట చేపట్టిన కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. దివాన్ చెరువు నుంచి శ్రీరామపురం వెళ్లే ప్రధాన రోడ్‌కు ఇరువైపులా బొగడ, మామిడి, మున్నగు రకాల మొక్కలను నాటారు. వాటికి చేర్చి ఉన్న వివిధ రకాల వ్యాపారులనే వాటి సంరక్షకులుగా ఉండాలని కోరారు. ఈ విధంగా నాటి మొక్కలను కాపాడుకుంటే అవి మనకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయన్నారు. మొదటి విడతగా 33 మొక్కలను నాటామని, ఈ కార్యక్రమాన్ని దాతల సహకారంతో మరింత ముందుకు తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో నన్నయ వర్సిటీ తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తలారి వాసు, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి గ్రంధి నానబ్బులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు భాషా సాహిత్యాలపై రెండు రోజులు నిర్వహించే అంతర్జాతీయ సదస్సు మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఆ కార్యక్రమం పోస్టర్లను వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం ఆవిష్కరించారు. సదస్సుకు యూనివర్సిటీ పరంగా పూర్తి సహకారం (సౌజన్యం) అందిస్తున్నామన్నారు. ఫ్రాన్స్, అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలకు చెందిన ప్రతినిధులతోపాటు బెనారస్, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, మైసూర్ వంటి ఇతర రాష్ట్రాల ఆచార్యులు కూడా పాల్గొంటారన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

14 బీరు సీసాల స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి వెంకటగిరి ప్రాంతంలోని పెంటారావు తోటలో సోమవారం బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై అంకారావు, సిబ్బందితో దాడి చేసి మైలపల్లి కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు అక్రమంగా విక్రయించేందుకు తీసుకవచ్చిన 14 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మైలపల్లి కుమార్‌ను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

మరో 10 బీరు బాటిళ్లు

స్థానిక టి.నగర్‌లో అక్రమంగా బీరు బాటిళ్లు విక్రయిస్తున్న చందాసత్రం వీధికి చెందిన మనోరంజన్ మసుంధర్‌ను టూటౌన్ ఎస్సై రేవతి, సిబ్బందితో అదుపులోకి తీసుకుని 10బీరుబాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

గేదెలు, ఆవులు మాయం

రాజమహేంద్రవరం రూరల్: తన గేదెలు, ఆవులు చోరీకి గురయ్యాయని వెంటాపురానికి చెందిన దయాకుమార్ సోమవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడు ఈనెల 22వ తేదీన తన రెండు గేదెలు, రెండు ఆవులను మేత మేయడానికి బయటకు వదిలాడు. అవి సాయంత్రానికి ఇంటికి చేరుకోలేదు. వాటికోసం వెతుకుతూ ఉండగా ఈ నెల 24న బూరుగుపూడి సమీపంలో ఒక వ్యక్తి వద్ద కనిపించాయి. అతడికి ఆరా తీయగా వీటిని కొంత మూరుకు చెందిన సురేష్, రాజు, చక్రి తనకు విక్రయించారని తెలిపాడు. దీంతో దయాకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చేప పిల్లల పెంపకంపై శిక్షణ

రాజానగరం: అల్లూరి సీతారామరాజు జిల్లా పందిరి మామిడిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఈ నెల 29 నుంచి మార్చి 4 వరకూ అలంకరణ చేపల పెంపకంపై శిక్షణ జరగనుంది. ఆసక్తి కల యువకులు ఈనెల 29లోగా పేర్లు నమోదు చేయించుకోవాలి. ఫోన్ నంబర్ 95533 64265.

బంగారు ఆభరణాలు చోరీ చేసే ముఠా అరెస్టు

ధవళేశ్వరం: ఆటోలో ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలను చోరీ చేస్తున్న ముఠా సభ్యులను ధవళేశ్వరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఇటీవల చోరీ చేసిన 44.810 గ్రాముల బంగారు ఆభరణాలు, నేరాలకు ఉపయోగిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాజీపేట మండలానికి చెందిన భార్యభర్తలు ఈ నెల 20వ తేదీన ధవళేశ్వరంలోని బంధువుల ఇంటికి వచ్చేందుకు వేమగిరిలో ఆటో ఎక్కారు. వీరితో పాటు మరో ముగ్గురు మహిళలు కూడా ఎక్కారు. అంబాజీపేటకు చెందిన దంపతులు తమ బంధువుల ఇంటికి వెళ్లి బ్యాగులో చూడగా, బంగారు ఆభరణాలు చూడగా కనిపించలేదు. దీంతో వారు ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు వల పన్ని ఇటువంటి నేరాలకు పాల్పడుతున్న మాడుగులు గ్రామానికి చెందిన గాదే సత్యవతి, చిన్నవేటి జ్యోతి, బొమ్మూరులో నివాసం ఉంటున్న కుమ్మ జాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 44.810 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలను, వారు నేరాలకు వినియోగిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో పి.గన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా ఇటువంటి తరహా నేరాలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసును త్వరితగతిన చేధించిన ధవళేశ్వరం పోలీసులను ఎస్పీ పి.జగదీష్, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ అభినందించారు.

ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధనే ధ్యేయం

మధురపూడి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు అత్యధిక మెజారిటీ సాధనే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో సోమవారం బూత్ స్థాయి శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో అలుపెరగని సైనికుల్లా పోరాడిన శ్రేణులు, అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ ప్రతి పక్షాల కుట్రలను కార్యకర్తలు ఛేదించాలన్నారు. ఇది ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధం అన్నారు. నియోజకవర్గంలో రూ.1,158 కోట్లతో జరిగిన అభివృద్ధిని ప్రజలకు చూపాలన్నారన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్ తేజ, పీఏసీఎస్ చైర్ పర్సన్ బుడ్డిగ సత్తిబాబు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మేకా రాజు పాల్గొన్నారు.

సూర్యదేవుడికి పుష్పయాగం

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి చివరి రోజు స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. అద్దాల శయన మందిరంలో ఉయ్యాల సేవలతో స్వామివారి పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. పుష్పయాగంలో ఆలయ ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాస బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి స్వామి వారు